క్లుప్తంగా

కోమటిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో శుక్రవారం ఆశ్రమం హ్యాండ్ ఆఫ్ హోప్, రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఐకాన్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన పేషంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. శిబిరంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌తో పాటు డాక్టర్ల టీం సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

రామాయంపేట(మెదక్): రామాయంపేట రెవెన్యూ డివిజన్ కోసం దీక్షలు కొనసాగుతున్నాయి. అఖిలపక్షం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ దీక్షలు చేపట్టి శుక్రవారం నాటికి 82 రోజులు కావస్తుంది. ప్రభుత్వం డివిజన్ ప్రకటించేవరకు దీక్షలు విరమించమని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేస్తామని వారు ప్రకటించారు.

నాణ్యత కొలతలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారి సుధాకర్

నర్సాపూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా లీగల్ మెట్రాలజీ జిల్లా ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. పెట్రోలు కొనుగోలులో నాణ్యత, కొలతలపై అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన బంకుల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బంకు యజమాని చంద్రశేఖర్‌గుప్తా, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏడుపాయలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

పాపన్నపేట(మెదక్): తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయన్ ఏడుపాయల వనదుర్గామాతను శనివారం సాయంత్రందర్శించుకోనున్నారని ఏడుపాలయ దేవస్థానం ఈఓ శ్రీనివాస్ తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కారం కావడంలేదు



జెండా ఆవిష్కరిస్తున్న రవీందర్

రామాయంపేట(మెదక్): రాష్ట్రంలో రవాణా కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు రవీందర్ ఆరోపించారు. శుక్రవారం అక్కన్నపేటలో ట్రాక్టర్ ఓనర్లు, డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీఏలో బ్రోకర్ల వ్యవస్థ ఇంకా కొనసాగుతుందని ఆరోపించారు. అనంతరం అక్కన్నపేటలో బీఎంఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు రమేశ్, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు నందారెడ్డి, డ్రైవర్ల సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బల్దియాలో చెత్తా చెదారం



మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇష్టారీతిగా చెత్తా చెదారం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని పదే పదే ప్రచారం చేసే బల్దియాలోని అధికారులు పరిశుభ్రత పాటించక పోవడం సిగ్గు చేటు. శుక్రవారం దశాబ్ది ఉత్సవాల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన పేపర్ ప్లేట్లు, ఇతర పదార్థాలను ఒక చెత్తబుట్టలో వేయకుండా కార్యాలయ ఆవరణలో ఎక్కడ పడితే పారవేశారు. దీంతో కార్యాలయ ఆవరణ మురికికూపంగా మారింది. ఇది గమనించిన ప్రజలు తమకు పారిశుధ్యంపై నీతులు చెప్పే బల్దియా అధికారులు పరిశుభ్రత పాటించక పోవడం దారుణమని మండిపడుతున్నారు.

ఘనంగా మైసమ్మ పండగ

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో మైసమ్మ పండగ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పేటలోని శిశుమందిర్ నుంచి గ్రామస్తులు ఊరేగింపుగా తరలి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచ్ సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మురళిపంతులు, ఎంపీటీసీ వీణసుభాశ్‌గౌడ్, విగ్రాం వేణుగోపాల్‌గౌడ్, కిష్టారెడ్డి, గంగారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డుల అందజేత

మెదక్ మున్సిపాలిటీ: పల్లె, పట్టణ ప్రగతి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అవార్డు, ప్రశంస పత్రాలు అందజేశారు. శుక్రవారం మయా గార్డెన్‌లో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు అవార్డులు అందజేశారు. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు కౌన్సిలర్ అరుణ పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించడంలో ఉత్తమ పనితీరుకు అవార్డు వరించింది. ఉత్తమ మున్సిపాలిటీగా తూప్రాన్ ఎంపికైంది. దీంతో చైర్మన్ రవీందర్‌గౌడ్‌కు, నర్సాపూర్, మెదక్, తూప్రాన్, రామాయంపేట కమిషనర్లకు అవార్డులతో పాటు ప్రశంస పత్రాలను ఎమ్మెల్యే, కలెక్టర్ అందజేశారు. అలాగే పలు గ్రామాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు, ఎంపీపీలకు, పారిశుధ్య కార్మికుల సైతం ప్రశంస పత్రాలను అందజేశారు.



మెదక్ మున్సిపాలిటీ: కౌన్సిలర్‌కు ప్రశంస పత్రం అందజేస్తున్న మెదక్, నర్సాపూర్ ఎమ్మెల్యేలు, కలెక్టర్



నర్సాపూర్: ఉత్తమ అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్



కౌన్సిలర్ నాగరాజుకు ప్రశంసపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజార్షిషా

నర్సాపూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్‌గోపాల్‌తో పాటు పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. మున్సిపాలిటీలో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందితో పాటు కౌన్సిలర్లను గుర్తించి మెదక్‌లో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో నర్సాపూర్, మెదక్ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు మెమోంటోలు, ప్రశంసపత్రాలు అందజేశారు. నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్, మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, పంబాల లలిత, పలువురు ఇతర సిబ్బంది మురళి, జేమ్స్, నవీన్, రాజు తదితరులు ప్రశంసపత్రాలు, మెమోంటోలు అందుకున్నారు.



కొల్చారం(నర్సాపూర్): అవార్డు అందుకుంటున్న జెడ్పీటీసీ మేఘమాల



వెల్దుర్తి(తూప్రాన్): ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ భాగ్యలక్ష్మి

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో ఉత్తమ కౌన్సిలర్లుగా ఎంపికైన గజవాడ నాగరాజు, మల్యాల కవితకు అవార్డులు, ప్రశంసపత్రాలను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజార్షిషా అందజేశారు. ఈమేరకు శుక్రవారం మెదక్ కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వీరు అవార్డులు అందుకున్నారు. వారిని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, ఇతర కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది ప్రశంసించారు.



మెదక్‌లో ఉత్తమ అవార్డును అందుకుంటున్న మనోహరాబాద్ ఎంపీపీ నవనీత



తూప్రాన్: ఉత్తమ మున్సిపల్ చైర్మన్ అవార్డును అందుకుంటున్న చైర్మన్ రవీందర్‌గౌడ్



చిన్నశంకరంపేట(మెదక్): ప్రశంస పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్

అందని రేషన్ బియ్యం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యం రేషన్ షాప్‌లకు చేరుకోలేదు. దీంతో రేషన్ బియ్యం కోసం ఎదురు చూస్తున్న పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఖాజాపూర్, రుద్రారం, చందంపేట, గవ్వలపల్లి, మడూర్ తదితర గ్రామాలకు ఇప్పటి వరకు రేషన్ బియ్యం చేరుకోలేదు. ప్రతీ నెల 5 నుంచి గ్రామాల్లో రేషన్ బియ్యం అందుబాటులో ఉండి ప్రజలకు అందించేవారు. ఈ నెల 16వ తేదీ వచ్చినప్పటికీ మండలంలోని సంగం గ్రామాలకు రేషన్ బియ్యం రాలేదు. గోదాములో రేషన్ బియ్యం నిల్వలు లేకపోవడంతో గ్రామాలకు రేషన్ బియ్యం చేరుకోలేదని సమాచారం. అధికారులు స్పందించి.. వెంటనే గ్రామాలకు రేషన్ బియ్యం అందించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మీ సేవ కేంద్రాలు పెంచాలి

నర్సాపూర్: పట్టణంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మీ సేవ కేంద్రాలను పెంచాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో జనాభా పెరుగుతుందని, ఇతర గ్రామాలకు చెందిన ప్రజలు సైతం ఆయా సర్టిఫికెట్లను పొందేందుకు గాను నర్సాపూర్‌లోని మీ సేవా కేంద్రాల్లోనే దరఖాస్తు చేయాల్సి రావడంతో రద్దీగా ఉంటున్నాయని చెప్పారు. ప్రధానంగా విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లే సమయంలో పలు రకాల సర్టిఫికెట్లను తహసీల్దార్ నుంచి పొంది వారు చదివే చోట అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి మీ సేవ కేంద్రాలను పెంచాలని కోరారు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి సర్వర్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరారు.

బడీడు పిల్లల్ని బడిలో చేర్పించాలి

పెద్దశంకరంపేట(మెదక్): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల నోడల్ అధికారి నీలకంటి విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో హెచ్‌ఎంల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 20న విద్యా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా స్థాయిలో ఎఫ్ఎల్ఎస్ టీఎల్ఎమ్ మేళాలో ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన పాఠశాలలు పాల్గొనాలని, మన ఊరు - మనబడి పనులను పూర్తి చేయాలని, మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్నఘనాపూర్ గ్రామానికి చెందిన శామ్సన్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి అత్యవసర చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన రూ.3.55 ఎల్‌ఓసీ పత్రాలను హైదరాబాదులో బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మున్సిపల్ అభివృద్ధిలో భేష్

జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

తూప్రాన్: పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని కార్మికులు జాతీయ జెండాలు, బోనాలతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఫాయి కార్మికులతో పల్లెలు, పట్టణాలు పరిశుభ్రత సాధిస్తున్నాయని, మున్సిపల్ అభివృద్ధిలో దూసుకుపోతుందని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోహన్, చైర్మన్ రవీందర్‌గౌడ్, కౌన్సిలర్లు, కార్మికులు పాల్గొన్నారు.



కార్మికుల ర్యాలీలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, చైర్మన్ రవీందర్‌గౌడ్

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 'మోడల్' విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ స్కీంకు ఏడుగురు మోడల్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఎన్ఎంఎంఎస్ ఇన్‌చార్జ్ పూర్ణయ్య తెలిపారు. మోడల్ పాఠశాల నుంచి 8వతరగతి విద్యార్థులు గత సంవత్సరం డిసెంబర్ నెలలో ఎన్ఎంఎంఎస్ కోసం పరీక్షలు రాయగా సహస్రరెడ్డి(కొండాపూర్), కార్తీ(చేగుంట), చైత్రశ్రీ(కర్నాల్‌పల్లి), వైష్ణవి(రుక్మాపూర్), చైతన్య (చేగుంట), ఆనందిత(చేగుంట), భువనేశ్వరీ (పొలంపల్లి) లు స్కాలర్‌షిప్ కోసం ఎంపికయ్యారు. వీరందరికీ ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ పూర్తి చేసే వరకు నెలకు రూ.1,000 చొప్పున కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ అందిస్తుందని తెలిపారు. వీరి ఎంపికపై హెచ్‌ఎం భూపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సర్టిఫికెట్‌ల కోసం యువకుల ఆందోళన

వెల్దుర్తి(తూప్రాన్): పాఠశాలలు, కాలేజీలు ప్రారంభం అవుతుండడం, ప్రభుత్వం బీసీలకు రూ.లక్ష సాయం అందిస్తుండడంతో పలువురు యువకులు, విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్‌ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. బీసీ రుణాలు, విద్యార్థుల అడ్మిషన్ల తేదీ దగ్గర పడుతుండడంతో సర్టిఫికెట్‌ల కోసం వందలాదిగా దరఖాస్తు చేసుకున్నారు. సర్వర్ మొరాయించడంతో గురువారం రాత్రి, శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు, విద్యార్థులు వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాత్రి సమయాల్లో పనిచేసైన సర్టిఫికెట్‌లు అందజేస్తామని తహసీల్దార్ నాగవర్ధన్ తెలిపారు.



యువకులను సముదాయిస్తున్న తహసీల్దార్

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సాయం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని జెడ్ చెరువు తండా గ్రామంలో గురువారం రాత్రి సేనావత్ తారి(40) పాము కాటుతో మరణించింది. నిరుపేద కుటుంబానికి చెందిన తారి కుటుంబానికి మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సభ్యుల ఆధ్వర్యంలో రూ. 5,000 ఆర్థిక సాయంతో పాటు రేషన్ కిట్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనాపల్లి సోషల్ సర్వీస్ ట్రస్ట్ సభ్యులు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, గుమ్ముల అజయ్, పంజా శ్రీనివాస్, గ్రామ ఉపసర్పంచ్ రాజ్యలక్ష్మి, బాబు, జాల శ్రీకాంత్, తిరుపతి, జగన్, బాల్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే.. బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ యువసేన ఆధ్వర్యంలో రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు.

◆ విద్యార్థులకు అక్షరాభ్యాసం

చేగుంట(తూప్రాన్): మండలంలోని వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో పూజలను నిర్వహించి, విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు రాజప్ప, హెచ్‌ఎం పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

◆ కంచన్‌పల్లిలో గర్భిణులకు వైద్యపరీక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లిలోని పల్లె దవాఖానాలో శుక్రవారం వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎం సుగుణ ఆధ్వర్యంలో గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి, రోగనిరోధక టీకాలు వేశారు.

◆ 22న శివ్వంపేట మండల సర్వసభ్య సమావేశం

శివ్వంపేట(నర్సాపూర్): ఈ నెల 22న శివ్వంపేట మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఎంపీడీఓ నవీన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 22న ఉదయం 11.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల సిబ్బంది విధిగా హాజరు కావాలని కోరారు.

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ రూరల్: పల్లెల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హవేళిఘనాపూర్ మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో రూ. 37 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన షాపింగ్ కాంప్లెక్స్ భవన పనులకు రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనపు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పల్లె ప్రగతి ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, వైస్ చైర్మన్ సూర్యతేజ, ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, సర్పంచ్‌లు చెన్నాగౌడ్, యామిరెడ్డి, భాగ్యలక్ష్మి, కిషన్, ఎంపీటీసీ అర్చన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

తూప్రాన్: విద్యార్థులు సరైన లక్ష్యం ఎంచుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని షీటీం ఏఎస్ఐ లక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని కంప్యూటర్ పాయింట్ విద్యార్థులకు చట్టాలు, హక్కులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ.. ఎవరైన వేధింపులకు పాల్పడితే షీటీం 100 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సదస్సులో షీటీం పోలీసులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీటీం ఏఎస్ఐ లక్ష్మి

ఘనంగా పట్టణ ప్రగతి



రామాయంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న చైర్మన్, తదితరులు



మెదక్ మున్సిపాలిటీ: మానవహారంలో ప్రజలు

రామాయంపేట(మెదక్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యాలయం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, పట్టణ పౌరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందిని సన్మానించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్ మన్నాన్, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ చంద్రం, మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు, యాదగిరి, అధికారులుపాల్గొన్నారు.

మెదక్ మున్సిపాలిటీ: దశాబ్ది ఉత్సవాల భాగంగా శుక్రవారం పట్టణంలో రాందాస్ చౌరస్తాలో మున్సిపల్ కార్మికులు, ప్రజాప్రతినిధులు మానవహారం నిర్వహించారు. అలాగే ముగ్గుల పోటీలు జరిగాయి. పారిశుధ్య కార్మికులకు, కౌన్సిలర్లకు ఉత్తమ సేవ ప్రశంస పత్రాలను చైర్మన్ చంద్రపాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు లక్ష్మినారాయణగౌడ్, సమీయొద్దీన్, శ్రీనివాస్, రాగి వనజ, కల్యాణి, లలిత, గాయత్రి, మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత ఉత్సవాలు



చిన్నశంకరంపేట(మెదక్): బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజిపేట గ్రామంలోని వెలసిన దుర్గామాత ఆలయ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి బోనం ఎత్తుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాధవిరాజు, సర్పంచ్ సాయిలు, సత్యనారాయణ, గ్రామ నాయకులు బాలకిషన్, రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎల్కపల్లి గ్రామ శివారులోని మండలేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవాలు జరుగుతున్నాయి.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని హరిచంద్ తండాలో జగదాంబమాత, సంత్‌సేవాలాల్ మహారాజ్‌కు తండావాసులు ఘనంగా బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్యానాయక్, ఉపసర్పంచ్ రాజునాయక్ తండావాసులు పాల్గొన్నారు.

భూముల బహిరంగ వేలం ఒప్పుకోం

- ప్రభుత్వ ధర చెల్లిస్తామంటున్న రైతులు
- ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్న అధికారులు



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న దొంతి వేణుగోపాలస్వామి దేవాదాయ శాఖ భూములను బహిరంగ వేలం పాట ద్వారా అమ్మకాలు చేస్తే ఒప్పుకునేది లేదంటూ రైతులు అన్నారు. శుక్రవారం మండలంలోని దొంతి గ్రామంలో ఉన్న దేవాలయ భూములు సాగు చేసుకుంటున్న రైతులతో దేవాదాయ శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవాదాయశాఖ వరంగల్ రేంజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు తదితరులు హాజరయ్యారు. వేణుగోపాలస్వామి భూములు దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న సర్వే నంబర్ 78 నుంచి 136 వరకు 598, 599లో 242 ఎకరాల భూమిని 150 మంది గ్రామ రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ భూములను బహిరంగ వేలం ద్వారా అమ్మకం చేస్తామని దేవాదాయ శాఖ సిబ్బంది చెప్పడంతో రైతులు వ్యతిరేకించారు. ఎన్నో ఏళ్ల నుంచి వంశపారపర్యంగా సాగు చేసుకుంటున్నామని అలాంటి భూములను బహిరంగ వేలం ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టి మా పొట్ట కొట్టేందుకు చూస్తున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ధర ప్రకారం ఎకరాకు రూ.4 లక్షల 50 వేలు చెల్లిస్తామని రైతులు అన్నారు. అలా కాకుండా బహిరంగ వేలంకు పోతే ఊరుకునేది లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల అభ్యర్థన ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్‌రావు అన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ తహసీల్దార్ గీత, రెవెన్యూ తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఆర్ఐ కిషన్, సర్పంచ్ ఫణిశాశంక్ శర్మ, ఎంపీటీసీ లక్ష్మి, రైతులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

తూప్రాన్ ఆర్డీఓగా జయచంద్రారెడ్డి

తూప్రాన్: తూప్రాన్ ఆర్డీఓగా ఎం.జయచంద్రారెడ్డి ఆర్డీఓగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆర్డీఓగా కొనసాగిన శ్యాంప్రకాశ్ బదిలీ అయ్యారు. నల్గొండ జిల్లా ఆర్డీఓగా పని చేసిన జయచంద్రరెడ్డి బదిలీపై తూప్రాన్ ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషాను మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



కలెక్టర్ రాజర్షిషాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జయచంద్రరెడ్డి